# చైత్రపూర్ణిమ



కథకుడు:
'అమరేంద్ర'

అది వాళ్ల జీవితంలో తొలివసంతం. శివరావుకు సృష్టి అంతా ఒక్క గిరిజాకుమారికోసమే అనిపిస్తోంది. ఈ ప్రపంచంలోని అందానికీ, యౌవనానికీ, లాలిత్యానికీ గిరిజయే మూర్తిభావ మనుకుంటున్నాడు. అప్పటికి గిరిజచూపులకుకూడా సృష్టికంతకూ శివరావే కేంద్రమయినట్లూ, అతనికంటే కోరదగిన దేదీ ప్రపంచంలో లేనట్లూ కనిపిస్తోంది. అతని దృష్టిలో గిరిజాకుమారి ఏకైకమైన ఆదర్శసుందరి. ఆమెదృష్టిలో శివరావు ఏకైకమైన ఆదర్శపురుషుడు. వారి కింకో ప్రపంచమే లేదు. తమరిద్దరే ఈ అనంతమైన సృష్టిలో రెక్కలుకట్టుకుని రివ్వున ఎగిరిపోతున్నట్లూ, తమ రిరువురికోసమే ఈ వసంతం, ఈ పువ్వులు, ఈ తుమ్మెదలు, ఈ కోకిలలు—తమ రిరువురికోసమే లోకంలో సుఖమూ, సౌందర్యమూ రాసులు పేరుకొనివున్నట్లూ!

వాళ్లిద్దరూ ఒకరికోసం ఒకరు నిరాశతో ఉస్సులు విడిచే ప్రేమికులు కారు. విధి వారిరువురినీ భార్యాభర్తలుగా కళ్యాణమంటపంలో నిలబెట్టి ఇప్పటికి ఏడాది అయింది. అంతకుమునుపు ఒకరిమీద ఒకరి కెంత మక్కువ వున్నా, గౌరవమున్నా పెళ్లి వాటన్నిటికీ ఫుల్‌స్టాప్ పెడుతుందని చాలామంది అంటారు. గిరిజను ఏరి కోరి శివరావు పెళ్లాడాడు. పెళ్లి అయినదగ్గరనుంచీ ఆమెమీద గౌరవం ఎక్కువయింది. తన సుఖదుఃఖాల్లో తోడునీడగా నిలిచే సహచరిగా గిరిజాకుమారి లభించటం అతని అదృష్టమని భావిస్తున్నాడు. గిరిజకుకూడా శివరావువంటివాడు భర్తఅయే అదృష్టం తనకే దక్కిందని లోలోపల కొంత గర్వం లేకపోలేదు. కాని ఆమె శివరావులాగా ఆ సంగతిని గురించి ఎవరిముందరా ఉపన్యాసాలీయలేదు.

గిరిజ కాపురానికి వచ్చి నాలుగు నెలలే అయింది. ఈపాటికి శివరావుకు ఆమెమీదున్న గౌరవం ఇగిరిపోవలసిందే. కాని కలిసినతరువాత గిరిజలో దాగివున్న గొప్పగుణాలన్నీ ఒక్కొక్కటే శివరావును ముగ్ధుణ్ని చేయసాగినయ్. ఇంతవరకూ గిరిజమీద అతని అభిప్రాయాలకు ఆధారంలేదు. ఆమెగొప్పతనమంతా అతని ఊహల్లో పుట్టి పెరిగింది. కాని క్రమంగా తెలుసుకోగలిగాడు తన ఊహల కందని సద్గుణాలు గిరిజలో దాగిఉన్నవని.

అది చైత్రపూర్ణిమ. వెన్నెల వేయిరేకులూ విప్పిన తెల్లని పద్మంలాగా ఆకసమంతా అలుము

కున్నది. ఆవెన్నెల ధగధగలలో ఏదో చెప్పలేని చల్లదనమున్నది. మల్లెపూలు జడలోంచి తీసి దండలు మంచులో వేస్తూ గిరిజ వెన్నెలచలువలో విప్పారిన ముఖంతో పచార్లుచేస్తోంది. ఆ వెన్నెట్లో ఆమెవన్నె కళ్లు మిరుమిట్లు గొలుపుతున్నది. విశాలమైన ఆమె నుదుట కుంకుమరేక అంత అందమైన ముఖాన్ని అలంకరించానన్న గర్వంతో తళుక్కుమన్నది. ఆమె సుకుమారమైన శరీరం నొచ్చుతుందేమోనని కట్టుకున్న నల్ల జరీచీరె సంకోచపడుతున్నది. ఆమె మౌనంగా అటూ ఇటూ పచార్లుచేస్తోంది. లక్షల నక్షత్రాలతో అలంకరించుకున్న విభావరికి, అట్టే అలంకారాలు లేకపోయినా ఇంత అందంగావున్న గిరిజాకుమారిని చూడగానే అసూయతో కన్నుకుట్టింది.

గిరిజ మేడమీదికి రావటం శివరావు గమనించాడు. అప్పటి కేదో పద్యాలపుస్తకం చదువుతూ ఆమెను పలకరించలేదు. గిరిజకూడా అతన్ని పలకరించకుండా దూరంగా మసకగా కనిపిస్తున్న చెట్ల గుబుర్లకేసీ, దగ్గరేవున్న చెఱువులో వికసించిన తెల్ల కలువలకేసీ చూస్తూ గోడకానుకుని నిలబడింది. కొంతసేపయినాక చదువు ఆపివేసి శివరావు కుర్చీలోంచి లేచివచ్చి గిరిజప్రక్కనే నిలబడి "ఏమిటి అంత తీవ్రంగా ఆలోచిస్తున్నావు గిరిజా?" అన్నాడు.

"ఆఁ, ఏమీ లేదు" అని తీయని స్వరంతో మారుపలికింది.

"గిరిజా, నా అంత అదృష్టవంతుడూ, నాకంటె దురదృష్టవంతుడూ ఈ లోకంలో మరొకడు లేడు."

"అదేమిటి, వింత ధోరణిలో మాట్లాడుతున్నారు?"

"నా అదృష్టానికి కారణం చెప్పమంటావా?" అని గిరిజముఖంలోకి తొంగిచూచాడు. ఆమెముఖంలోనూ, కళ్లలోనూ లేతసిగ్గు తెరలుతెరలుగా ఆవరించింది. ఆమె తలవంచుకున్నది. శివరావు "గిరిజవంటి ఇల్లాలు దొరకటం గొప్ప అదృష్టం. ఈ అదృష్టం మరి ఎవ్వరి కున్నది? ఇక నా దురదృష్టానికి కారణమడుగుతావా? మా తాతగారు పల్లకీలెక్కి పాదంకిందమోపి ఎరుగని జమీందారు. మానాన్నగారు పట్టుబట్టలు తప్ప మరొకటి తొడిగి యెరుగని విలాసపురుషుడు. నేనో, కుటుంబాన్ని పోషించుకోవటంకోసం పొట్ట చేతపుచ్చుకొని లోకంలో చెమట ఓడ్చవలసిన నిర్భాగ్యుణ్ణి. అయినా గిరిజా, నీవంటి ఇల్లాలు నా నిర్భాగ్యంలో సగభాగం భరించేందుకు నిలబడిఉన్నప్పుడు ఇక నాకేం భయం? ఎంతకష్టం వచ్చినా చిరునవ్వుతో ఎదుర్కొంటాను" అని ఒక్కగుక్కలో అన్నాడు. అతను ఎంత మనస్ఫూర్తియైన మాటలు చెప్పినా అవన్నీ ఏదో పుస్తకంలోంచి అప్పజెప్పుతున్నట్లుంటుంది. ఆసంగతి గిరిజకు తెలుసు. అతను మనసారా నమ్మితేగానీ మాట్లాడడన్న విషయంకూడా ఆమెకు తెలుసు. భర్తకు ఏమి సమాధానం చెప్పాలో తెలియటంలేదు. "నేను హిందూవనితను. మీ ధర్మపత్నిని" అని ఎంతో ఒయ్యారంగా బదులు చెప్పింది. అది విని శివరావు ఉప్పొంగిపోయి గిరిజభుజాలను తన చేతులలో నిమురుతూ "అవును, గిరిజా, ఎంత చక్కగా చెప్పావు! నువ్వు నాధర్మపత్నివి. అంతేకాదు. నువ్విప్పుడు వీరపత్నివి కాబోతున్నావు. పద్మవ్యూహంలో చొరబడబోయే అభిమన్యుడిని సాగనంపిన ఉత్తరకంటే గొప్ప వీరపత్నివి"

తన పురుషుడు తనను కొనియాడటం విని ఏస్త్రీ సంబరపడకుండా ఉండగలదు?

"అయితేగిరిజా, నన్ను వెళ్లమనిఅనుమతిస్తావా?"

"సాహసించినవారినే విజయలక్ష్మి వరిస్తుంది!"

"ఎందరు నీకు పిరికిపాలు పోసినా బెదరకూడదు గిరిజా. ఎవ రేమన్నా సరే, నువ్వు నీచేత్తో నా వీపు తట్టి 'మీకేం భయం లేదు. సుఖంగా వెళ్లండి. శుభంగా తిరిగిరండి' అని ధైర్యంగా సాగనంపాలి. కాని—"

గిరిజకళ్లలో నీళ్లు తిరిగినయ్. శివరావు గిరిజ తలను చేతులతో నిమురుతూ—"మళ్లీ పిరికిదాని వొతు

న్నావా గిరిజా? నన్ను ప్రోత్సహించేవాళ్లింకెవరున్నారు చెప్పు? విధి మనిద్దర్నీ బలమైన బంధంలో బిగించింది. ఏ దేశంలో ఎక్కడ వున్నా సరే నిన్ను మరిచిపోను. యుద్ధమైపోయి ఇంటికి తిరిగివచ్చేదాకా నిన్ను తలచుకుంటూ దినాలు గడుపుతాను."

"మీనోటివాక్యాన దైవం చల్లటిచూపు చూసి మీరు సుఖంగా ఇంటికి తిరిగిరావాలనే నా ఆరాటం. అందుకోసం దినదినమూ దేవుణ్ణి పాదాలుపుచ్చుకుని వేడుకుంటాను. మిమ్మల్నొక్క వర మడుగుతున్నాను."

"తప్పకుండా అడుగు గిరిజా. అది ఎంత కష్టమైనదైనా నెరవేరుస్తాను."

"ఈ దీనురాలిని మరిచిపోకుండా వుంటారా?"

"ఎంత వెర్రిదానివి గిరిజా? నిన్ను మరిచిపోతే నన్ను నేనే మరిచిపోతాను."

శివరావు వైమానికుడుగా యుద్ధంలో చేరి ఊరు విడిచి వెళ్లేప్పుడు బంధువులంతా బావురుమన్నారు. గిరిజాకుమారి తొణుకూ బెణుకూ లేకుండా భర్త నుదుట కుంకుమ పెట్టింది. మెళ్లో మల్లెపూలదండ వేసి "సుఖంగా వెళ్లిరండి" అని సాగనంపింది. శివరావు ఎంతో నిబ్బరంగా, కనపడినంతసేపూ గిరిజకేసి తిరిగి తిరిగి చూస్తూ వెళ్లిపోయాడు. బండి కనుచూపుమేర దాటిపోగానే గిరిజ వచ్చి దేవతామందిరం తలుపులు బిగించుకుని "తండ్రీ, చల్లటిచూపు చూసి వారిని ఏ ఆపదా రాకుండా కాపాడు. నాకుంకుమ-" అని మనసులో పదేపదే అనుకుంటూంది. బైటనుంచి ఎందరు తలుపుకొట్టినా తీయలేదు. లోపలినుంచి భోరుభోరున ఏడుపు పొర్లుకొస్తోంది. "తండ్రీ, నీ చలవకంటె మా కింక దిక్కేమున్నది?" అని మాటిమాటికీ మనసులో అనుకుంటూ గిరిజ నేలమీద సాష్టాంగపడింది.

* * *

ఆరు సంవత్సరాలు ఆరు యుగాలుగా గడిచినయ్. ఎంత ఆందోళన, ఎంత ఆరాటం, ఎంత ఆశ, ఎంత దుఃఖం? పదిహేనుదినాల కోసారి శివరావు దగ్గరనుంచి కులాసాగా ఉన్నట్లు ఉత్తరం వచ్చేది. ఎక్కడ ఉన్నాడో తెలియకపోయినా ఎక్కడో ఒకచోట చల్లగా వున్నందుకు గిరిజ వెయ్యిదేవుళ్లకు మొక్కుకొనేది. మళ్లీ ఉత్తరం వచ్చేదాకా మితిలేని ఆందోళన. ఈసారి ఏమని వింటానో, ఈమారు ఎటువంటి కబురు చెవినిపడుతుందో అని మనసులో మితిలేని బాధ పడేది గిరిజ. ఉత్తరం రాగానే బరువంతా దింపినట్లయిపోయేది. అమ్మయ్యా అని నిట్టూర్పు విడిచేది. ఆ ఉత్తరం పుచ్చుకు దేవతామందిరంలో గంటల తరబడి కదలకుండా కళ్లు మూసుకుని జారగిలపడివుండేది.

ఏపనిలో వున్నా సరే విమానంమోత వినగానే గబగబా డాబామీదికి పరుగెత్తుకొచ్చి అది మబ్బుల్లో నలుసులాగా కలిసిపోయేదాకా అదేపనిగా చూస్తూ నిలబడేది.

ఎవరైనా బంధువులు వచ్చి "ఎల్లా వెళ్లనిచ్చావు గిరిజా? ఏమంత అవసర మొచ్చింది చెప్పు? నారు పోసినవాడు నీరుపోయడా?" అంటూ పలకరించేవారు. "భయమేమీ లేదు. సుఖంగా తిరిగివస్తారు" అని నిబ్బరంగా గిరిజ వాళ్లతో బైటికి అనేది. ఆ సమయంలో ఆమెమనసెంత గజగజ వణికిపోతుందో, చెదరిపోతున్న ధైర్యం చిక్కబట్టుకునేందుకు మనసుతో భగవంతుని పాదాలను ఎంత గట్టిగా చుట్టివేస్తుందో ఎవరికి తెలుసు?

యుద్ధం ముగిసే సూచనలు కనపడుతున్నయ్. ఈ క్షణందాకా భర్త క్షేమంగా వున్నట్లు ఉత్తరం వస్తోంది. సంధి అయిపోయి ఇంకో అయిదారునెలల్లో శివరావు ఇంటికి వచ్చేస్తాడు. ఆనాడు గిరిజ ఎటువంటి స్వాగత మిస్తుందో ఎవరు చెప్పగలరు? కాలం గడుస్తున్నకొద్దీ ఆమెమనసులో ఆశలు నక్షత్రాలకంటె విరివిగా పెరిగిపోతున్నయ్.

* * *

ఆ రోజు రానేవచ్చింది. శివరావు వస్తున్నానని టెలిగ్రాం యిచ్చాడు. గిరిజ స్టేషను దగ్గరికే వచ్చి

తనకు స్వాగతమిస్తుందనీ, ఆరేళ్ల తరువాత మళ్లీ ఆ ముద్దులొలికే ముఖాన్ని కళ్లారా చూసే భాగ్యం లభిస్తుందనీ, ఇంకా ఎన్నో కలలు కంటూ శివరావు రైలు దిగాడు. స్టేషను దగ్గరికి ఊరివాళ్లంతా ఎదురుగా వచ్చి పూలదండలు వేశారు. కాని గిరిజ రాలేదు. శివరావు మనసు చివుక్కుమన్నది. ఈ శుభసమయాన్ని గిరిజ ఎందుకు పాటించలేదు? తనకు ఎదురువచ్చి కోమల బాహువులతో తన కంఠాన్ని ఎందుకు చుట్టివేయలేదు? మనసు పరిపరివిధాల పరుగులుతీస్తోంది. ఇంటి దగ్గరనుంచి బండీ తోలుకువచ్చిన నౌకరు కాకీబట్టలలో వున్న తనను చూసి బెదురుతున్నాడు. తనకు వాడి పేరు గుర్తుంది. వాడు తమదగ్గర తరతరాలుగా వున్న నౌకరు. "రామస్వామీ! ఏం మరిచిపోయావా?" అని శివరావు పలకరించాడు.

"లేదు బాబయ్యా, మీరు చల్లగా ఇంటికి తిరిగి వచ్చారన్న సంబరంతో నానోట మాట రాటంలేదు బాబయ్యా."

"అంతా బాగున్నారా? అమ్మగారు స్టేషనుకు వస్తానన్లేదూ?"

"అమ్మగారి వొంట్లో బొత్తిగా బాగులేదు బాబుగారూ" అని ముఖం తిప్పివేసుకొని ఎద్దుల్ని తొందరగా అదలికించసాగాడు. వొంట్లో బాగా లేదా? ఏమి జబ్బో? గిరిజ తనను ఆహ్వానిస్తుందని ఎంతగా ఆశపడ్డాడు? ఆ సన్మానాన్ని గురించి ఎన్ని కలలు కన్నాడు? అవన్నీ చివరకు గాలిమేడలై కూలిపోయినయ్యా?

బండి ఇంటిముందు ఆగింది. గభాలున బండీ దిగాడు శివరావు. అక్కడికైనా గిరిజ ఎదురువస్తుందేమోనన్న ఆశతో. గిరిజతల్లి ఎదురుగావచ్చింది. గిరిజ చెల్లెలు ఇందిర-పన్నెండేళ్ల పిల్ల వచ్చి బావగారి మెళ్లో పూలమాల వేసింది. "మరిచిపోయినట్లున్నావ్ బావా? అవున్లే, మేం గుర్తుంటామా" అని మరదలి సరసమాడింది. ఇంతలో అత్తగారు లోపలినుంచి కాఫీపట్టుకు వచ్చింది. కాఫీకప్పు చేత్తో పుచ్చుకున్నాడన్నమాటేకాని ఒక్కగుక్కయినా లోపలికి పోలేదు. గిరిజ ఎక్కడుంది ఇందూ?" అని అడిగాడు. ఇందిర "ముందు అక్కయ్యను చూడటానికి వీలులేదు. ఎంతో బడలికతో వచ్చావు. ముందు స్నానానికిలే. భోజనం చెయ్యి. ఆ తరువాత నిన్ను అక్కను చూడనిస్తా" నంటూ బావను చెయ్యిపుచ్చుకొని ఇంట్లోకి లాక్కుపోయింది. తనగదిలో నక్కివుందేమో గిరిజ అనుకున్నాడు. అక్కడా లేదు. తన చేతిమీదుగా పెట్టాలని వంట చేస్తోందేమో అనుకున్నాడు. అక్కడా లేదు. ఏమయిపోయింది గిరిజ? ఎక్కడదాక్కున్నది?

ఏమీ పాలుపోక శివరావు గదిలో పడకకుర్చీలో పడుకుని తాంబూలం వేసుకుంటున్నాడు. ఇంతలో ఇందిర చెయ్యి పుచ్చుకుని నెమ్మదిగా దోవ చూపిస్తూ ఎవరినో నడిపించుకువచ్చింది. ఆమనిషి వచ్చి చేతులతో శివరావుపాదాలను చుట్టేసి "ఎప్పుడు వచ్చారు?" అని అడిగింది. ఆమనిషి కళ్లలోంచి నీటిచుక్కలు శివరావుపాదాలమీద రాలినయ్. అతని వొళ్లు జలదరించింది. ఎవరీ నిర్భాగ్యజీవి? తన పాదాలను విడవకుండా చుట్టుకొంటోంది. ఒళ్లంతా మశూచిమచ్చలతో భయంవేస్తోంది. ముఖమంతా వికృతంగా గుంటలుపడిపోయింది. కాయలుకాసిన తెల్లటిగుడ్లు ఆ భయంకరమైన ముఖంలో కొట్టవచ్చినట్లు నిలబడివున్నయ్. ఎవరీ కురూపి? ఎవరీ అభాగ్యురాలు?

ఇందిర "బావా" అని పిలిచింది. "అక్క వచ్చింది ఒకసారి చూడు." అంది. శివరావు కళ్లుగట్టిగా మూసుకుని మాటాడలేదు. వొళ్లంతా గొంగళి పురుగులు పాకినట్లయిపోతోంది. ఆచేతుల నొక్క విదిలింపు విదిలించి అక్కడినుంచి దూరంగా పారిపోవాలనిపిస్తోంది. ఇక ఎన్నటికీ ఈముఖంకేసి చూడకుండా దూరంగా వెళ్లిపోవాలనిపించింది. గుండెలమీద వెయ్యికుంపట్లు పెట్టినట్లుంది. "పద, ఇందూ, పదమ్మా, వారు కాసేపు పడుకుంటారు. మనం పోదాం పద." ఆ స్వరం ఎంతో పరిచితంగా

అతని మనసుకు తాకింది. ఇంత అందవికారమైన రూపంలో అంత మధురమైన స్వరం ఇంకా ఎక్కడ దాగివుందో? ఈ ఒక్క స్వరాన్ని మాత్రం మిగిల్చి స్వప్నసుందరియైన ఆ గిరిజ కనబడకుండా మాయమై పోయిందా? ఆ మధురమూర్తి స్మృతిని చెరిగిపోకుండా చేసేందుకు ఈ స్వర మొక్కటి చాలుతుందా?

చెల్లెలిచేయి పుచ్చుకుని గిరిజ దోవతడువుకుంటూ గదిలోంచి వెళ్లిపోవటం శివరావు చూడలేదు. మునుపు సరోవరంలో ఠీవిగా సాగే రాజహంసలా నడిచే గిరిజ ఇప్పుడు తూలుతూ, తడువుకుంటూ అవధ్యూరాలులాగా నడవటం చూస్తే అతని గుండె చెరువై పోయేది. ఆ వికృతమైన రూపం మళ్లీ కంటబడుతుందేమోనని బెదురుతూ శివరావు కళ్లు తెరిచాడు. గది అంతా శూన్యంగా బిక్కుబిక్కుమంటోంది. అతని లోపలనుంచి పట్టరానంత దుఃఖం ఉబికివస్తోంది. ఎంత అన్యాయం చేసింది విధి? గిరిజ మరణించినా అంత దుఃఖం కలిగేది కాదు. గిరిజరూపమంతా దొంగిలించి వికృతమైన కట్టెను మిగిల్చిపోయింది. ఎందుకో తన మీద విధికి అంత కసి? ఆ కసి తనమీదనే తీర్చుకుంటే ఎంత బాగుండేది? తను యుద్ధరంగంలో ప్రాణం విడిస్తే ఇంతకంటె చక్కగా వుండేది.

ఇందు కాఫీ పట్టుకువచ్చింది. శివరావుముఖంకేసి చూసి చిన్నపిల్ల అయినప్పటికీ జాలిపడి "బావా, ఏడవబోకు. నువ్వు చల్లగా యింటికి తిరిగివచ్చావు. అదే మాకు పదివేలు!"

"అల్లా గనబోకు ఇందూ; నా కోపం వస్తోంది. ఎందుకు ఇంటికి తిరిగివచ్చానా అని విచారిస్తున్నాను. ఏ బాంబుదెబ్బకో నాప్రాణం ఎగిరిపోతేనే ఎంతో హాయిగా వుండేది. ఇంక ఆముఖాన్ని నేను చూడలేను. ఇందూ!" అని వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

తలుపువెనకనుంచి అత్తగా రందుకొని "మీరే అంత అధైర్యపడితే ఎల్లా చెప్పండి? ఏనాటికి ఏది అనుభవమో ఏం చెప్పగలం? దాని మనస్సు ఎంత క్షోభపడిపోతోందో ఆపరమాత్ముడి కెరుక" మందలింపుతో కూడిన ఓదార్పుమాటలన్నది. శివరావుతల గిర్రున తిరిగిపోతోంది. మాటా మంతీ లేకుండా శిలలాగా పడకకుర్చీలో పడివున్నాడు.

గిరిజవికృతరూపం ఎక్కడ కంటబడుతుందో అని శివరావు తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈసంగతి మొదటే గిరిజ వూహించగలిగింది. మునుపు తన రూపాన్ని చూసి ముగ్ధుడైపోయిన శివరావు ఇప్పటి తన మచ్చలముఖాన్ని చూసి మూర్ఛపోతాడనీ, తనను చూసి భయంతో కళ్లు మూసుకుంటాడనీ, ఏవగింపుతో తన ముఖం చూడకుండా దూరదూరంగా వుంటాడనీ గిరిజ ముందుగానే వూహించ గలిగింది. తనను కలుసుకోవాలని ఎంతో ఆశతో దూరదేశాల నుంచి సురక్షితంగా ఎగిరివచ్చిన శివరావుకు తన ముఖం చూపకుండా వుండాలని గిరిజ ఎంతో ప్రయత్నించింది. తన ముఖం చూడగానే అతని మనసు ఎంత బెదిరిపోయి నీరై పోతుందో ఆమెకు ముందే తెలిసింది. అందుకనే అమ్మవారు పోసినదగ్గరనుంచీ ఆమె పెదవులమీద ఒక్కటే ప్రార్థన. ఆయన రాకముందే నన్నీలోకంలోంచి తొలగించు భగవంతుడా అని ఒక్క వరసన పరితపించింది. శివరావుసుఖానికి తన పాడుబ్రతుకు ఎక్కడ అడ్డంవస్తుందో అని లోలోపల కుమిలిపోయింది. "ఆయన ఇంటికి క్షేమంగా రావటమే నాకు పదివేలు. నాప్రార్థనలన్నీ ఫలించినయ్. దైవం చల్లనిచూపు చూశాడు. కాని నా కింకో ప్రార్థన మిగిలివున్నది. ఆయన యింటికి వచ్చేసరికి నన్నీలోకంలో లేకుండా చేసి దైవం రక్షించాలి. నా కోసం ఆయన యెంత దుఃఖించినా అప్పటి దుఃఖానికీ, ఇప్పుడు అనుక్షణమూ శల్యంలాగా గుచ్చుకుంటున్న నాపాడురూపాన్ని చూసి క్షోభపడే శోకానికీ ఎంతో భేదమున్నది. నేను చచ్చిపోతే నాస్మృతి వారి కన్నీళ్లలో కలిసిపోయి వారి మనసులో కలకాలమూ నిలిచిపోయేది. ఇప్పుడో? నాతలంపే వారి మనస్సులో చిచ్చు రగిలిస్తుంది. నన్ను ఒక భూతంగా,

పిశాచంగా వారు చూచి బెదిరిపోయి దూరంగా తొలగిపోతారు. నేను ఏం తప్పుచేశాను తండ్రీ? ఎందుకు నాకీఘోరమైన శిక్ష విధించావు? నేను తెలియక నీకేమైనా అపరాధం చేసినా, దానికి ఇంత కఠినశిక్ష విధించాలా తండ్రీ? వారి మనసును బాధపెడుతూ ఈ పాడుబ్రతుకు నాకెందుకు చెప్పూ?"

మునుపు గిరిజ కనబడకపోతే శివరావుకు క్షణం కూడా యుగంగా వుండేది. ఇప్పుడు నెలలతరబడిగా ఆమెను చూడకుండా వుండగలుగుతున్నాడు. ఒక్క ఇంటిపట్టున ఉన్నప్పటికీ ఆ భార్యాభర్తలు ఒకరికొకరు కనబడి నెలలు గడిచింది. ఇందిర ఇంట్లో అక్కగారికి ఉపచారం చేస్తున్నది. గిరిజతల్లి కూతురుకు వచ్చిన విపత్తును తలుచుకుని కుమిలిపోతూ కాలం వెళ్లదీస్తున్నది.

వచ్చిన తరువాత యిన్నాళ్లకు శివరావు యింట్లోంచి బైటికి కదిలాడు. మునుపటి స్నేహితులందరికీ ముఖం చూపించివద్దామని బయలుదేరాడు. మొదటగా చిన్ననాటి స్నేహితుడు శ్రీధరదగ్గరికి వెళ్లాడు. శ్రీధరదీ, శివరావుదీ ఒక్కటే ప్రాణం. శ్రీధర శివరావు తనను మరచిపోయాడేమో ననుకున్నాడు ఇంతదాకా కనబడకపోవటం చూసి. శివరావుకు ఎదురుగా శ్రీధర స్టేషనుదగ్గరికి వెళ్లాడు. కాని ఆ నాడు శివరావుకు మనసు మనసులో లేదు. ఎవరినీ చూడలేదు. ఎవరినీ పలకరించలేదు. అది చూసి "అప్పుడే నన్ను మరిచిపోయాడు. కళ్లు నెత్తిమీది కెక్కినయ్" అని అతనిమీద శ్రీధరకు కోపంవచ్చింది. ఇవాళ శివరావు తనంతట తానే వచ్చి తలుపు కొట్టేసరికి శ్రీధరకు పట్టరాని సంతోషం వచ్చింది. "ఏరోయ్. ఇంకా మేం గుర్తున్నామన్నమాట." అని శ్రీధర పరిహాసం చేశాడు. శివరావు "అదేమిట్రా అన్నాయ్. నువ్వు కూడా అల్లా అంటావేం?" అని బదులుచెప్పాడు. శ్రీధర "ఉమా, ఓ ఉమా, ఏం చేస్తున్నావ్? మీ మరది వచ్చాడు. దబ్బున కాఫీ పట్టుకురా" అని కేక వేశాడు. ఉమ కాఫీ పట్టుకువచ్చింది. శివరావు ఆమెను చూసి బేజారయిపోయాడు. "ఈమె శ్రీధర భార్యేనా? ఈమెకోసమేనా అతను కులంకూడా పోగొట్టుకున్నది? ఈమెఅందాన్నేనా లోకులు వేనోళ్ల పొగుడుతూవుండేవాళ్లు?" బెదురుతూవున్న శివరావుముందు కాఫీకప్పు పెట్టి "మరదిగారు మరచిపోయినట్లున్నారే?" అని పలకరించింది. శివరావుకు ఆమెరూపాన్ని చూడగానే గొంగళిపురుగులు పాకినట్లయింది. "ఎందుకు మరచిపోతాను వొదినా." అని నవ్వుతూ బదులుచెప్పాడు. అంతటితో ఊరుకోక "మా చెల్లెలు కులాసాగా వుందా" అని కుశల ప్రశ్న వేసింది. శివరావు తలకిందులైపోయాడు. ఏమీ తోచక అవునన్నట్లు తలవూపాడు. ఉమ వెళ్లిపోయింది యింట్లోకి. శ్రీధర అందుకుని ఒక్కగుక్కలో ఆ వూరు మశూచితో పడ్డ అగచాట్లన్నీ చెప్పుకుపోయాడు. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బతికామన్నాడు. ఆవూరిలో గిరిజకూ, ఉమకూ ఇద్దరికే మరీ ఒత్తుగా పోతపోసిందన్నాడు. గిరిజగుణగణాలను పొగడుతూ చిత్రకారుడైన శ్రీధర ఒక్కసారిగా కవి అయిపోయాడు. శివరావు యుద్ధంలో వున్నన్ని రోజులూ ఆమె చూపిన ధైర్యమూ, అతని క్షేమంకోసం ఆమెతహతహ, అతను సుఖంగా తిరిగి రావాలని ఆమె చేసిన పూజలూ అన్నీ వర్ణించి శివరావుముఖంకేసి చూశాడు. ఇవన్నీ వింటున్న శివరావుకళ్లలో నీళ్లు గిర్రున తిరిగినయ్. "మళ్లీ వస్తానన్నయ్యా" అంటూ లేచి ఇంటిదోవ పట్టాడు.

నడుస్తున్నంతసేపూ అతని మనసులో ఒక్కటే ఆలోచన. "నాప్రాణంకోసం గిరిజ యింత పరితాపపడింది. నా కష్టంలో తను భాగం పంచుకుని ధైర్యంగా నిలబడింది. ఇప్పుడామెకు కష్టం వచ్చినప్పుడు నేనేం చేస్తున్నాను? పరాయివాడిలాగా గిరిజనుచీదరించుకొని దూరదూరంగా తిరుగుతున్నాను. గిరిజ నాకోసం పడ్డ పరితాపంలో వెయ్యోవంతు నేను ఆమెకోసం పడటం లేదు. కృతజ్ఞతఅయినా చూపటంలేదు. నేను ఆపదలో చొరబడేసమయాన

ఆమె నాకు చేయూత ఇచ్చి ముందుకు పంపింది. ఇప్పుడామె అంగవైకల్యంతో అలమటిస్తున్నప్పుడు ఆదుఃఖంతో నాకేమీ పనిలేనట్లు దూరంగా తిరుగుతున్నాను. ఆనాడు గిరిజ నన్నొక వర మడిగింది. ఈదీనురాలిని ఎన్నడూ మరచిపోరుగదా? అని. ఇప్పుడు నిజంగా నేను మరిచిపోలేదా? గిరిజకు కలిగిన దుఃఖంలో లేశమైనా నేను పంచుకొన్నానా?"

ఇంటికి వచ్చాడు. వాకిట్లో అడుగుపెట్టాడు. అంతవరకూ కుర్చీలో కూర్చొని సావిట్లో గిరిజా, ఇందిరా ఏవో కబుర్లాడుకుంటున్నారు. శివరావు అడుగుల అలికిడి వినబడగానే "అరుగో. మీబావ వస్తున్నట్లున్నారు. ఇందూ, పద పద. నన్నిక్కడినుంచి తీసుకుపో. నీకు పుణ్యముంటుంది. వారికంట బడకుండా నన్ను నా గదిలోకి తీసుకుపో." అని గిరిజ చెల్లెలిని తొందర పెట్టటం వినబడింది. ఆ మాటలు శివరావుకు చురుక్కున తగిలినయ్. గిరిజ లేచి ఇందు చెయ్యి పట్టుకోబోతుండగానే శివరావు లోపలికి అడుగు పెట్టాడు. గిరిజగుండె దడదడలాడుతోంది. ఇందు తొందరతొందరగా అక్కగారిని నడిపించుకుపోబోతోంది. ఇక ఆగలేక శివరావు అన్నాడు: "కూర్చో గిరిజా, కూర్చో. నన్ను చూసి ఎందుకంత భయపడుతావు? ఇందూ! మీ అక్కకు నీవు చెప్పు నేను మునుపటి బావనేనని." గిరిజ సిగ్గుతో తలవంచుకుని నిలబడింది. ఆ క్షణంలో తనకాళ్లకింద నేల నోరుతెరచి తనను మింగివేస్తే ఎంత బాగుంటుంది అనిపించింది గిరిజకు. "కూర్చో అక్కా" అంటూ ఇందు చెయ్యి పుచ్చుకుని గిరిజను కుర్చీదగ్గరికి గుంజింది. "వద్దమ్మా వద్దు. నా పాడుముఖాన్నిక వారికి చూపలేను. నన్నిక్కడినుంచి తీసుకుపో." అంది గిరిజ. ఈ మాటల్లో ఎంత క్షోభ, ఎంత వేదన పలసల కాగుతున్నయో శివరావుకు అవగతమయింది. తను రెండడుగులు ముందుకువేసి గిరిజచేతులు పుచ్చుకుని కూర్చోమని కుర్చీ అందించాడు. గిరిజచేతులకు శివరావుచేతులు తాకగానే గడిచిపోయిన కాలంలోని సుఖమంతా ఒక్కసారి వచ్చి పలకరించినట్లయింది. గిరిజ వణికిపోతోంది సంతోషంతో. ఆమెమనసు చూపులేని గుడ్లను బద్దలుకొట్టుకుంటూ పరిగెత్తుకువచ్చి శివరావుశరీరాన్ని ఒక్కసారి చూడాలని తహతహలాడిపోతోంది. ఆమె తనను తాను సంబాళించుకోలేక తన వేళ్లతో శివరావువొంటినంతా ఒక్కమారు నిమిరింది. ఆస్పర్శే గిరిజమనసుకు దృష్టికాబోలు! యుద్ధంలో ఎన్నో పాట్లు పడి చివరికి సుఖంగా ఇల్లుచేరిన శివరావును కళ్లారా చూసుకునే భాగ్యం లేదని కుమిలిపోతున్న ఆమెప్రాణానికి ఆస్పర్శ ఎంత ఓదార్పు నిచ్చిందో! వెంటనే గిరిజ తన్ను తాను నిందించుకుంటూ "ఛీ! ఎంత సిగ్గులేనిదాన్ని. ఈ పాడుచేతులతో మిమ్మల్ని తాకటానికి వెరవని మూర్ఖురాలిని. నన్ను క్షమించండి. నన్నిక్కడినుంచి తీసుకుపోవే, ఇందూ. వారికి నా పాడుముఖం చూపించటమేకాక నాపాపిష్ఠి చేతులతో వారిని తాకేనే—" అని గద్గదికంతో అరిచింది. శివరావు గిరిజను తన చేతుల్లోకి తీసుకుని నిమురుతూ "ఎందుకు గిరిజా, నిన్ను నువ్వు నిందించుకుంటావు? ఇందులో నీతప్పేముంది? నీచేతులారా చేసిందేముంది?" అని ఓదార్చాడు. గిరిజమనసుకు ఈమాటలు పన్నీటిజల్లులాగా సోకినయ్. "నాతప్పేమీ లేకుండానే దైవం నన్నిల్లా శిక్షించాడా? ఎంత అపరాధం చేసివుండకపోతే యింత కఠినశిక్ష వేస్తాడు?" అని గిరిజ తన వేదనను వెల్లడించింది. శివరావు గిరిజచేతులు తన చేతుల్లోకి తీసుకుని "నువ్వేం తప్పుచేశావ్ గిరిజా? తప్పంతా నాదికాదూ? నన్ను యుద్ధంలోకి ధైర్యంతో సాగనంపటం నీతప్పా? నేను వెళ్లిన దగ్గరనుంచీ నాప్రాణంకోసం ఒక్క వరసన ఆందోళనపడటం నీతప్పా? నేను సుఖంగా తిరిగిరావటంకోసం పూజలుచేయటం నీతప్పా? కాదు. తప్పంతా నాదే—"

"అదేమిటి, మీతప్పేమున్నది?"

"ఔను గిరిజా, తప్పంతా నాదే. ఇంకొకరిముందు చెప్పుకోటానికి సిగ్గుపడేవాడిని. కాని నీముందు నాకు జంకులేదు. నాక్షేమంకోసం నువ్వెంత వ్యథపడ్డావో, ఎంత ఆందోళనపడ్డావో నాకు తెలుసు. కాని నేనెంత నీచుణ్ణనుకున్నావ్! ఇల్లువదలిన తరు

వాత నీక్షేమంకోసం అందులో నెయ్యోవంతైనా ఆందోళనపడలేదు. అంతే కాదు. నీ కింత ఆపద వచ్చిందని విన్నాకకూడా యివ్వాళవరకూ నిన్ను చీదరించుకుంటూ దూరంగా తిరిగాను. తలుచుకుంటే నాతల నరకినట్లవుతుంది. నీకు వచ్చిన ఆపదే నాకు వస్తే ఏమయ్యేది? నువ్వు నన్ను ఈవిధంగానే చూచేదానివా? నువ్వు నేనంటే ఈమాదిరిగానే చీదరించుకునేదానివా? చెప్పు. గిరిజా. అదే మీకూ మాకూ తేడా."

ఏం చెప్పాలో గిరిజకు తోచటంలేదు. శివరావుమాటలు గిరిజమనసుకు ఎంత చల్లగా తాకి ఓదార్చినవో ఆమెకు తెలుసు. ఏదో తెలియని సంతోషం ఆమెముచ్చల ముఖంమీదా, కాయలుకాసిన కళ్లల్లోనూ రెక్కలు విప్పుతోంది. అది చూడగానే శివరావు మనసుకు పూర్వపు గిరిజరూపం ఒక్కసారిగా కళ్లకు కట్టింది. ఆ గిరిజ యేమైపోయింది? శివరావును పరీక్ష చేసేందుకు అపురూపసుందరియైన గిరిజయే యీ అంద వికారమైన వేషంతో వచ్చిందా?

"బావా, స్నానానికి లేస్తావా?" అని ఇందిర తలుపువెనకనుంచి పిలిచింది. శివరావు లేచి బయలు దేరాడు. అతనివెనకాలేగిరిజతనంతటతా నేనడచివెళ్లింది గదిబయటికి. అక్కముఖంకేసి చూసి ఇందిర పొంగిపోయింది. గిరిజకళ్లలో మును పొక విపరీతమైన వెలుగుండేది. ఇప్పుడు ఆవెలుగు ఆరిపోయింది. కళ్లలో ఆరిపోయిన ఆ కాంతి ఇప్పుడు గిరిజముఖమంతా నిండి ధగధగమన్నది. "ఇందూ, సబ్బూ తుండుగుడ్డా నా చేతి కివ్వవే" అంది గిరిజ. వాటిని అక్కగారికి అందిస్తూ ఇందిర "అక్కా, దోవజాగర్త. తూలిపోతావు" అంది. గిరిజ మారుపలకకుండా కళ్లున్నవారిమాదిరిగానే గబగబా నడిచి భర్తవెంట నీళ్లగదిలోకి వెళ్లింది. విస్తుపోతూ ఇందిర నిలబడిపోయింది.

శివరావు నిద్రలేచేసరికి ముఖంపుడకా, నీళ్లూ ఎదురుగావుండేవి. కిందికి దిగివచ్చేసరికి గదిఅంతా శుభ్రంగా కనబడేది. టేబిలుమీద గుడ్డ ముడతలు లేకుండా పరచివుండేది. ఫ్లవర్‌పాట్‌లో తెల్లవారేటప్పటికి దొడ్లోపూసిన రంగురంగుల పూలన్నీ తేలుతూ ఇంపుగా కనబడేవి. ఈపనులన్నీ ఎవరు చేస్తున్నారా అని ఆశ్చర్యపడేవాడు. గిరిజ చెల్లెలిచేత ఇవన్నీ చేయిస్తోందేమో ననుకున్నాడు. అప్పుడు గిరిజ చుక్కైనా తొణకకుండా కాఫీ పట్టుకొచ్చింది. శివరావు చకితుడైపోయాడు. గిరిజచేతులోంచి కప్పు అందుకొని "గిరిజా, నీకు దేవతలేమైనా దివ్యదృష్టి యిచ్చారా? చెప్పు. ఎల్లా చేస్తున్నావ్ ఈపనులన్నీ" అని అడిగాడు. గిరిజ సిగ్గుపడుతూ తల వంచుకొని "ఏమో నాకు తెలియదు." అంది.

ఆనాడు చైత్రపూర్ణిమ. గడచిపోయిన జీవితాన్ని తలచుకుంటూ ఆ చల్లటివెన్నెలలో శివరావు కళ్లుమూసుకుని పడుకున్నాడు. మేడమెట్లమీద ఎవరో ఎక్కివస్తున్నట్లు చప్పుడయింది. కొంతసేపటికి గిరిజ పైకిరావటం చూశాడు. ఇంత నిటారుగా, జారుడుగా వున్న మెట్లు ఎల్లా ఎక్కివచ్చిందో అని ఆశ్చర్యపోయాడు. ఇంతరాత్రిఅయినా ఇంకా ఎందుకు మేలుకొనివున్నదో, ఇప్పు డిక్కడికి ఎందుకు వచ్చిందో అనుకుంటూ ఏం చేస్తుందో చూదామని నిద్రపోతున్నవాడిలాగా కదలకుండా పడుకున్నాడు. సగం మూసి తెరుస్తున్న కళ్లతో గిరిజను చూస్తూ నివ్వెరపోయాడు. గిరిజ మెల్లగా వచ్చింది. ఒకమాటు చేతులు పైకెత్తిఆకాశంలోకి కనబడని కళ్లతో చూస్తూ దణ్ణంపెట్టింది. తరువాత శివరావుమంచంచుట్టూ మూడుమాట్లు తిరిగింది. ఎవరైనా చూస్తున్నారేమోనని అటూయిటూ చూసింది. అతడి రెండుపాదాలనూ కళ్లకద్దుకుని చేతులతో పాదధూళి తీసుకుని నుదుట బొట్టుపెట్టుకుంది. చివాలున లేచి శివరావు గిరిజచేయి పుచ్చుకొని "అమ్మదొంగా. ఇన్నాళ్లకు దొరికావూ! ఎన్నాళ్లనుంచీ చేస్తున్నా వీదొంగతనం?" అన్నాడు. గిరిజ దొరికిపోయిన దొంగలాగా బెదురుతూ, ఏమీ మాట్లాడకుండా నిలబడిపోయింది. శివరావు కూర్చోమని గిరిజను మంచంమీద కూచోపెట్టాడు. వణుకుతూ గిరిజ కూర్చున్నది. శివరావు

గిరిజతలను తన గుండెలకు చేర్చుకొని "గిరిజా, ఆనాడు నువ్వు నన్ను ఏంవరం అడిగావో గుర్తున్నదా? ఆనాడు చైత్రపూర్ణిమ. అప్పుడు వెన్నెట్లో నీకళ్లు అగాధమైన సముద్రాల్లాగా మెరిసినయ్. గిరిజా, ఇప్పుడుకూడా అదే చంద్రుడు. అదే వెన్నెల. అవే హృదయాలు మళ్లీ అదే చోట కలుసుకున్నయ్."

"కాని—" అని గిరిజ చెక్కిళ్లమీదుగా, జారుతున్న కన్నీళ్ల నద్దుకుంది. శివరావు మళ్లీ చెప్పుకుపోతున్నాడు: "ఆనాడు నువ్వు నన్నడిగినదే ఈనాడు నేను నిన్నడుగుతున్నాను. అప్పుడు గిరిజ నా భార్య అవటం గొప్ప అదృష్ట మన్నాను. ఇప్పుడూ అదే మళ్లీ అంటున్నాను. ఆనాడు నాకష్టమంతా నువ్వు మోశావు. భార్యకు సహజంగా వుండే భీతిని దూరంగా తోసి నన్ను ధైర్యంగా సాగనంపావు. నేను వచ్చేదాకా నాకోసం విపరీతమైన పరితాపపడ్డావు. ఈనాడు నాకు నీ దుఃఖంలో సగభాగం యిమ్మని వేడుకుంటున్నాను. ఔను గిరిజా. మనమిద్దరం పెళ్లిపందిరిలో కలిసిననాడే మన సుఖదుఃఖాలు ఒకటిగా పెనవేసుకుపోయినయ్. అప్పటినుంచీ నాసుఖమే నీసుఖం, నీ దుఃఖమే నా దుఃఖం."

గిరిజ అందుకొని "కాని, కాలం ఆ గిరిజ నెత్తుకుపోయింది. ఆ గిరిజను దొంగిలించి ఒక వికృతమైన కట్టెను మిగిల్చిపోయింది. నన్ను తాకేటందుకు మీ రెంత రోతపడుతున్నారో. నా ముఖం చూసినప్పుడల్లా మీ మన సెంత చీదరించుకుంటోందో. అందుకే మీరు తిరిగి సుఖంగా ఇల్లు చేరకమునుపే నన్నీలోకం నుంచి దూరంగా తీసుకుపొమ్మని దైవాన్ని ఎంతో వేడుకున్నాను. నా మొర ఆలకించక ఇక్కడే పడేసి వుంచాడు."

"గిరిజా, మొదట నేనూ అల్లాగే బాధపడ్డాను. కలకలలాడే గిరిజను చూసిన కళ్లను అమాంతంగా పొడిచివేసుకుందామనుకున్నాను. అసలు తిరిగిరాకుండా యుద్ధంలోనే ప్రాణం విడిచివుంటే ఎంత బాగుండేదో అనిపించింది. కాని మనిద్దరినీ దైవం ఎందుకు బతికించాడో. ఆయనఉద్దేశమేమిటో?"

గిరిజ "నన్నెందుకు బతికించావు తండ్రీ" అని వెక్కి వెక్కి ఏడ్వసాగింది. ఏమని ఓదార్చాలో శివరావుకు తెలియలేదు. ఎంతోసేపు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. దూరంగా మామిడితోపులో నిద్రరాని కోకిల లోకదాని నొకటి కవ్వించుకుంటూ కూస్తున్నయ్. ఎవరో చల్లగా దీవిస్తున్నట్లుగా తెల్లని వెన్నెల అన్నిటినీ పులకింపజేస్తున్నది.

చివరికి శివరావు అందుకున్నాడు. "గిరిజా, మనం ఇంకా నాలుగుకాలాలపాటు భార్యాభర్తలుగా బ్రతకటమే ఆయనఉద్దేశం. సుఖంలోనూ, దుఃఖంలోనూ, ఎండవానల్లోనూ ఒకరినొకరం విడవరాదని ఆయనసంకల్పం."

"కాని ఈ కురూపి గిరిజతోనే బ్రతుకంతా వెళ్లదీస్తారా? అంత కఠినశిక్ష మీకెందుకు? ఇంకెవరినైనా పెళ్లాడి సుఖపడండి. మీసుఖంకంటె నాకొకావలసిందేముంది? మీ ఇద్దరికీ సేవజేస్తూ దాసిగా మీ పాదాలముందు నన్ను బతకనివ్వండి."

"గిరిజా! నిజంగా నీకు కావలసింది నాసుఖమే నా?"

"ముమ్మాటికీ మీ సుఖమే"

"అయితే, నీకు పుణ్యముంటుంది. నాసుఖమే నువ్వు కోరుకునేట్లయితే ఈమాట మళ్లీ యెప్పుడూ నాముందు ఎత్తబోకు. ఎత్తనని నాచేతులో చెయ్యి వేసి చెప్పు."

వణుకుతున్న చేతిని అతని చెయ్యిమీద ఆన్చి గిరిజ అన్నది: "ఎత్తను. ఎన్నడూ ఎత్తను."

ఆమె వొంగిన ముఖంనుంచి కన్నీరు ఆచేతుల మీద చిందింది.

కొంచెంసేపయినాక మునుపటిలాగా శివరావు "గిరిజా, నాఅంత అదృష్టవంతు డింకోడులేడు." అన్నాడు. గిరిజ తలవంచుకుని "కాని మీ గిరిజ

ఎన్నటికీ తిరిగిరాకుండా మాయమై పోయిందన్న సంగతి మరచిపోయారా? ఈ కురూపి గిరిజనే మీరు గొప్ప అదృష్టంగా భావిస్తున్నారంటే అంతా నవ్వుతారు."

"ఎందుకు నవ్వుతారు, గిరిజా! నవ్వనీ. వాళ్ల కేం తెలుసు? నాగిరిజను కోల్పోయానేమోనని ముందు నేను భయపడ్డాను. కాని చివరికి కనుక్కున్నాను. ఆ గిరిజ నాదగ్గరికి మరొక వేషం వేసుకువచ్చిందని తెలుసుకున్నాను. అందుకే నాఅంత అదృష్టవంతు డెవడూ లేడని మళ్లీ అంటున్నాను."

"అయితే ఈ కురూపిలో మీకు మునుపటి గిరిజ దొరుకుతుందనే ఆశ వుందా?"

"తప్పక దొరుకుతుంది. ఆగిరిజలో కొట్టుకున్న గుండే కాదా ఈగిరిజలో కొట్టుకుంటున్నది? గిరిజా, ఈరూప మొక మాయ తెర. ఆ తెర తీసిచూసిన వాడికి అంతటా ఒకటే అందమైన ఆత్మ వెలుగుతూ కనబడుతుంది. ఇవాళ నీలో నాకు ఆ వెలుగు దొరికింది. గిరిజా, నీలో ఇదివరకు నేను కనుగొనని అందం ఇప్పుడు కనుగొన్నాను. ఇకముందు కనుగొంటాను. నిజం. గిరిజా, నీ కురూప మొక మారువేషం. ఆ వేషంలో నిన్ను కనుక్కోగలనా, లేనా అని దైవం నన్ను పరీక్షచేశాడు. నేనే గెలుపొందాను!!" గిరిజ అతని కాళ్లను చుట్టుకుని విడవలేదు.

కొసరికొసరి కోకిల కూసింది!